ఓం శ్రీసాయిరాం

# శ్రీ సత్యసాయి సేవాసంస్థలు

## ఆంధ్రప్రదేశ్

## 'దొరకునా ఇటువంటి సేవ'

(సంగీత నృత్య నాటకం)

రచన, దర్శకత్వం :

**యమ్. యస్. ప్రకాశరావు**

ప్రదర్శకులు :

**శ్రీ సత్యసాయి యువత, ఆంధ్రప్రదేశ్**

**పాత్రలు :**

| | | |
|---|---|---|
| ఈశ్వర్ | - | లెక్చరర్ |
| రాఘవ, గోపాల్, శ్యామ్ | - | విద్యార్థులు |
| నారాయణ | - | సంపన్నుడు |
| నరసింహం | - | వ్యాపారి |
| నాగేంద్ర | - | మోతుబరి రైతు |
| ఆనంద్ | - | నారాయణ కుమారుడు |
| శంకరయ్య | - | నారాయణ నౌకరు |
| శ్రీరాం | - | డాక్టర్ |
| పవన్ | - | డాక్టర్‌కి సహాయకుడు |

# "దొరకునా ఇటువంటి సేవ"

(సంగీత నృత్యం నాటకం)

(సాయి యువత ఉత్సాహంగా నృత్యం చేస్తూ ఉంటారు)

పల్లవి : ఉన్నారా.... ఉన్నారా.... ఉన్నారా యువకులు ఉన్నారా
భరతజాతి నెత్తురు దేహాన ప్రవహించే యువకులు ఉన్నారా!
ఉంటే మరి కదలరే ఉరుగులెత్తి సాగరే....
సాయి సందేశభేరి మనకై వినిపిస్తోందని విన్నారా!
యువకులు ఉన్నారా.... ఉన్నారా... ఉన్నారా....

సాయి సేవ ధ్యేయంగా కదలిరండి తరలిరండి
విశ్వశాంతి లక్ష్యంగా కదలిరండి కదలిరండి

చరణం -1 కపటము కార్పణ్యము కలతలు చెలరేపాయి...
స్వార్థము విద్రోహము కార్చిచ్చు రగిల్చాయి...
సమతను సాధించేందుకు సాయిబాట చాటేందుకు -
అఖిల విశ్వమానవాళిని నఖండముగ నిలిపేందుకు
ఉన్నారా.... ఉన్నారా.....

చరణం-2 విశ్వానికి సత్యస్ఫూర్తినందించిన సాయి
ధర్మ నిరతి ప్రభోదించినట్టు సత్యసాయి
ప్రేమామృత దివ్యసృష్టి కురిపించిన సాయి
సేవా చైతన్య ప్రభలు వెలయించిన సాయి
అండగ నేనున్నానని అభయ మిచ్చుసాయి...
ఇతడే... ఇతడే... ఇతడే...
మా దైవం... మా ప్రాణం.... మా గురువనే....
మనసు మమతలు గల యువకులు ఉన్నారా.
ఉంటే మరి కదలరేం ఉరుగులెత్తి సాగరేం
సాయీ సందేశభేరి మనకై వినిపిస్తోందని విన్నారా...
విన్నారా... ఉన్నారా.... విన్నారా...

Contd...3

చరణం-3 సాయీ సందేశభేరి విన్నాము...
సాయీ సందేశభేరి విన్నాము...
సాయీశుని చరణసీమ తలలు వంచి మ్రొక్కేము...
సాయీశుని చరణసీమ తలలు వంచి మ్రొక్కేము...
సాయీ సందేశభేరి విన్నాము...
నీతికి ప్రతి రూపంగా జాతికి నవదీపంగా
సాయివాణి వేదంగా అనుక్షణమూ జీవిస్తారు
సాయివాణి వేదంగా అనుక్షణమూ జీవిస్తారు
సాయీ సేవ జీవంగా ప్రేమ పెంచుతాం
ప్రేమ పంచుతాం...
మానవాళి సేవచేసి మా సాయిని సేవిస్తాం
దీనజనుల సేవచేసి మా సాయిని సాధిస్తాం
మా సాయిని సాధిస్తాం... మా సాయిని సాధిస్తాం..

ఈశ్వర్ : రాఘవా, గోపాల్, శ్యామ్ మిమల్ని చూస్తుంటే నాకెంతో గర్వంగా ఉంది. యువకులుగా ఉన్నప్పుడే అవతార పురుషుని దివ్యబోధనలు విన్నారు. సాయిబాటలో నడవాలనీ సాయి సేవలో తరించాలని ఉవ్విళ్ళూరుతున్నారు. సేవతోనే వారి సన్నిధిని చేరుకోవాలనే సంకల్పం గుండెలనిండా నింపుకున్నారు. ఎంత అదృష్టవంతులు ఎన్ని జన్మల పుణ్యఫలమో. ఈ వజ్ర సంకల్పం సడలనీయకండి. ఈ సంకల్పం సాకారం కావాలంటే ప్రేమబాటే రాచబాట. మీ గుండెల్లో ప్రేమలతలు చిగురించనివ్వండి, పుష్పించనివ్వండి. ఆ ప్రేమ పెంచండి, పంచండి. స్వామి నాకిచ్చిన బిడ్డలు మీరు. స్వామీ! ఈ బిడ్డలను సన్మార్గంలో నడిపించండి తమ సేవతో ఈ పిల్లలు మీ సుందరవదనారవిందలలో ఒక్క చిరునవ్వు చిగురించగలిగిస్తే చాలు నాకు.

(నాగేంద్రం, నారాయణ, నరసింహం చపట్లు కొడతారు.)

నారాయణ : శభాష్ ఇరవై ఏళ్ళకే అరవై సంవత్సరాల వృద్ధుల్ని చేస్తున్నారన్నమాట మా వాళ్ళని

ఈశ్వర్ : యువకుల్ని సన్మార్గంలో నడవమని బోధించడం తప్పా.

నరసింహం : తప్పుకాదంటారా! మీరు తెలివైనవారు. లెక్కలు అద్భుతంగా చెప్పగల ఆచార్యులు

Contd...4

అందుకే మా పిల్లలకి చదువుచెప్పటానికి మిమ్మల్ని నియమించుకున్నాం.

ఈశ్వర్ : మీ అంచనా మేరకు వారిని నా సబ్జెక్టులో నూటికి నూరు మార్కులు సాధించగల ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాను.

నాగేంద్రం : థ్యాంక్స్ అక్కడితో మీరు ఆగిపోయి ఉంటే బాగుండేది.

నారాయణ : మా వాళ్లు మంచి మార్కులు సాధించుకునేవారు. మంచి కోర్సుల్లో సీట్లు సంపాదించుకునేవారు.

ఈశ్వర్ : మంచి కోర్సుల్లో సీట్లు వాళ్ళకి తప్పక లభిస్తాయి.

నరసింహం : కాని మీ పరిధి దాటి అడుగు ముందుకి వేశారు.

ఈశ్వర్ : అంటే

నాగేంద్రం : అర్థంకాలేదా. ప్రేమ, సేవ, మానవతా విలువలంటూ వారి గమ్యాన్ని మరో వైపుకి మళ్లించారు.

ఈశ్వర్ : అందరినీ ప్రేమించమని చెప్పటం తప్పా, సాటి వారిని సేవించమని చెప్పడం నేరమా!

నారాయణ : నేరమే, చదివిన చదువంతా వృధా చేసుకుని సంఘసేవ సర్వేశ్వరుడి సేవ అని తిరుగుతుంటే, వారు కోటీశ్వరులు కావాలనే మా కలలు ఏం కావాలి.

సరసింహ : సమాజంలో అత్యుత్తమ స్థానాల్ని అలంకరించాలనే మా కోరిక ఎలా తీరాలి.

నాగేంద్రం : మా పిల్లలు సమాజంలో అద్భుతమైన పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలనే మా ఆశలు ఎలా నేరవేరాలి చెప్పండి.

ఈశ్వర్ : ఇవన్నమాట మీ అనుమానాలు బాబా భోధనలు పాటిస్తే సంపదలు, పదవులు,

ప్రతిష్టలు కాకుండా వేలాది మంది హృదయాలలో జ్యోతుల్లా వెలిగిపోతారు మీ పిల్లలు.

నారాయణ : దానివల్ల మాకొచ్చే లాభం ఏమిటి

ఈశ్వర్ : ఈనాడు లక్షలాది ఇళ్ళలో కరవవుతున్న ప్రేమను వాళ్ళు మీకు అందించగలుగుతారు.

నరసింహం : ఆహా ఇంకా మానవుడు దేవుడని కూడా చెప్పుతున్నారంట. ఇది విడ్డూరం కాదా

ఈశ్వర్ : కాదు. మానవునిలో ఉన్న దివ్యత్వాన్ని అతనికి గుర్తుచేసి, దానవత్వాన్ని పెంచుకోకుండా, సంస్కరించదానికే భగవంతుడు అవతరిస్తాడు. మానవుణ్ణి సంస్కరించాలంటే అతడికి అర్ధమయ్యే రీతిలో ధర్మాన్ని బోధించాలి, ఆచరించి చూపించాలి. చేయి పట్టుకు నడిపించాలి. అందుకే దేవుడు మానవుడిగా అవతరిస్తాడు, మనం నిత్యం దైవాలుగా ఆరాధిస్తున్న రాముడు మానవుడు కాదా? కృష్ణ పరమాత్మ మానవుడు కాదా? బుద్ధుడు మానవుడు కాదా? జీసస్ మానవుడు కాదా? షిర్డీసాయినాధుడు మానవుడు కాదా? భగవాన్ శ్రీ సత్యసాయిబాబా కూడా అందుకే మానవునిగా అవతరించాడు. ఆ ప్రేమావతారమూర్తి తన ప్రతి ప్రవచనాన్ని ఆచరించి చూపిస్తున్నారు.

నాగేంద్రం : భగవంతుడంటే ఎన్నో దివ్యశక్తులు ఉండాలి కదా!

ఈశ్వర్ : నిజమే! భగవంతుడు మానవుడిగా అవతరిస్తే, ఆయనకు సర్వజ్ఞత్వమూ, సర్వాంతర్యామిత్వమూ, సర్వజగద్రక్షకత్వమూ, కీర్తి, వైభవం, ప్రకృతిపై ఆధిపత్యం, కలలో సాక్షాత్కరించడం, సృష్టికి ప్రతి సృష్టి చేయడం, మానవాతీతమైన అద్భుతాలు సాధించడం, నిర్జీవుణ్ణి సజీవుని చేయడమనే లక్షణాలు ఉంటాయి. ఒక్కొక్క లక్షణానికి బాబా జీవితంలో అసంఖ్యాకమైన సంఘటనలున్నాయి. ఏ దేవుడినైనా ఒక మతం వారు ఆరాధిస్తారు. కాని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారిని హిందువులు, మహమ్మదీయులు, సిక్కులు, క్రైస్తవులు, యూదులు, బౌద్ధులు, విశ్వవ్యాప్తంగా అన్ని మతాలవారు, అన్ని దేశాల వారు ఆయనని సర్వేశ్వరుడని, సర్వజగద్రక్షకుడనే ఆరాధిస్తున్నారు. ఉద్రేకపడక ఆలోచించండి. మీ బిడ్డలు

Contd...6

గొప్పవారు కావాలనుకోకండి. మంచివారు కావాలనుకోండి.

మీరు చెట్టునీ, పుట్టనీ, శిలావిగ్రహాల్ని, ఫోటోల్నీ మీరు దేవుడని నమ్ముతారు, ఆరాధిస్తారు. అది తప్పనను. మీ విశ్వాసమే వాటిని భగవంతుడిగా మారుస్తుంది. అవే దైవమైతే సర్వమానవాళికీ ప్రేమ పంచి యిచ్చే దివ్యపురుషుడు భగవంతుడుకాడా. నారాయణగారు ఒక్క సంవత్సరంపాటు మీ పిల్లల ప్రవర్తనని గమనించండి. వారి మహోన్నత వ్యక్తిత్వం మిమ్మల్ని ఆకట్టుకోక పోతే మీ ఇష్టం వచ్చిన రీతిలో వారి జీవితాల్ని తీర్చిదిద్దుకోండి. నాకే అభ్యంతరములేదు.

శంకరయ్య : నారాయణబాబూ! నారాయణబాబూ!

ఈశ్వర్ : ఉండు శంకరయ్యా! విషయం నేను చెపుతాను.

నారాయణ : ఏమైంది మాష్టారు! ఏమైంది.

ఈశ్వర్ : గుండె దిటవు చేసుకోండి. ఏది జరిగినా మన మంచికే జరుగుతుంది. ఇటీవల మీ పెద్దబ్బాయి ఆనంద్‌కి లక్షరూపాయలు ఖరీదు చేసే మోటార్ సైకిల్ కొనిచ్చారు. వాడికి అది అవసరమా అని ఆలోచించలేదు. మీ హోదా చాటుకోడానికే కొన్నారు. కానీ అదే వాడి పాలిట శాపమైంది.

నారాయణ : ఏం జరిగింది మాష్టారూ?

ఈశ్వర్ : ముగ్గురు స్నేహితులను ఎక్కించుకొని, వాయువేగంతో మీ వాడు మోటర్‌సైకిల్ నడిపాడు. ఏక్సిడెంట్ అయ్యింది.

నారాయణ : ఆ... ఏక్సిడెంటా? మా వాడికి ఏమీ కాలేదు కదా!

ఈశ్వర్ : రెండు కాళ్ళకీ ప్రమాదకరమైన ఫ్రాక్చర్‌లు అయ్యాయి. ఆస్పత్రిలో చేర్చాము. ఇప్పుడు బాగానే ఉన్నాడు.

నారాయణ : ఏ ఆస్పత్రి చెప్పండి. వెంటనే వెళతాను నా బిడ్డను చూసుకొంటాను.

ఈశ్వర్ : తొందరపడకండి. ఇది జరిగి నెలరోజులయింది.

నాగేంద్రం : మరి మాకు చెప్పలేదేం

ఈశ్వర్ : మీ సంగతి, మీ పుత్ర వ్యామోహం సంగతి మీ వాడికి తెలుసు అందుకే ఆనంద్ నాకు కబురు పంపించ్చాడు. నేను మా సాయి సోదరులు ఆస్పత్రికి వెళ్ళాం. నారాయణగారూ? మీరీ విషయం వింటే తట్టుకోలేరని మీ వాడు చెప్పాడు. అందుకే మీకు చెప్పలేరు. మిమ్మల్ని పిలవలేదు. వెంటనే ఆస్పత్రికి అయ్యే ఖర్చు మేమే భరించి ట్రీట్‌మెంట్ చేయించాం. ఇప్పుడు కాస్త లేవగలుగుతున్నాడు. నెలరోజులు వాడి చెంతనే ఉండి ఆత్మవిశ్వాసాన్ని, దైవ విశ్వాసాన్ని పెంచుకోమని అదే తనను కాపాడుతుందని చెప్పాను.

సాయి యువకులంతా ఎంతో సేవ చేశారు. ఇప్పుడు ఆనంద్ ఆరోగ్యం బాగు పడింది. మీ వాణ్ణి సాయి సోదరులే ఇక్కడకు తీసుకొస్తున్నారు. ధైర్యంగా ఉండండి. మీరు కన్నీళ్ళు పెట్టుకుంటే ఆనంద్ అధైర్యపడతాడు. వాణ్ణి మళ్ళీ మనిషిని చేసే బాధ్యత మాకు వదలి పెట్టండి.
(వీల్‌ఛైర్‌తో ఆనంద్ ప్రవేశం)

నారాయణ : ఆనంద్! ఏమిటి నాయనా ఇది - ఎంత ఘోరం జరిగిందిరా - భగవంతుడు ఎంత చిన్నచూపు చూశాడు కనీసం కబురైనా పంపించవురా - తల్లిదండ్రులం అంత కాని వాళ్ళం అయ్యామురా

ఆనంద్ : బాధపడకు నాన్నా! ఇది నా తప్పు. నేను చేసిన తప్పుకు దైవాన్ని నిందించకు. నాకొక్కటే చింత. మళ్ళీ అందరిలా నడవగలనా, పెద్ద డాక్టర్ కాగలనా. నా కలలు పండుతాయో లేదో అని దిగులుగా ఉంది నాన్నా.

నారాయణ : ఆనంద్! నన్ను క్షమించు నాన్నా! నీకీ దుస్థితిని కలిగించింది నేనే. అవసరం కాకపోయినా నీకు మోటర్‌సైకిల్ కొని ఈ ఘోరానికి కారణమయ్యానురా. నన్ను క్షమించు.

ఈశ్వర్ : నారాయణగారూ! జరిగిన దానికి విచారించకండి. ఆనంద్! అధైర్యపడకు. జరగబోయే దాని గురించి ఆలోచించకు ఆనంద్‌ని నా దగ్గరే వదలి పెట్టండి.

Contd...8

వాడి వయసు పిల్లలతో సరదాగా కొన్నాళ్ళు గడిపితే వాడి బాధ, దు:ఖం మరిచిపోతాడు.

రాఘవ : ఆనంద్‌ని మా అన్నలాగా చూసుకొంటాం అంకుల్.

గోపాల్ : మా ప్రేమను పంచి ఇస్తాం.

శ్యామ్ : ఆనంద్ ముఖంలో మేం చిరునవ్వులు పూయిస్తాం.

ఈశ్వర్ : చూశారా నారాయణగారు! భగవంతుడు ఆనంద్ చుట్టూ ఎంత అద్భుతమైన ప్రేమవలయం సృష్టించాడో. ఏ బంధువులు ఇంత ఆత్మీయతను చూపిస్తారు. చెప్పండి. ధైర్యంగా ఉండండి. గొప్ప ఆర్థోపెడీషియన్ డా॥ శ్రీరామ్‌గారు త్వరలోనో ఇక్కడకు వచ్చి ఆనంద్‌ని పరిక్షీస్తామని చెప్పారు బాబా మీద నమ్మకం వుంచండి. మీరు ఆనందంగా వెళ్ళండి.

నారాయణ : మాష్టారు! మా వాణ్ణి మీ చేతుల్లో పెడుతున్నాను. ఇకవాడి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత మీదే.
(ప్రేమ్ ఈశ్వర్ హై అన్న పాట నేపథ్యంలో వినిపిస్తూ ఉంటుంది. రాఘవ, గోపాల్, శ్యామ్ ఆనంద్‌కి అన్ని సపర్యలూ చేస్తారు.)

ఈశ్వర్ : ఊ! ఎలా ఉంది ఆనంద్?

ఆనంద్ : మాష్టారూ! నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. రాఘవ, గోపాల్, శ్యామ్ నన్ను కంటికి రెప్పలా చూసుకొంటున్నారు. ప్రపంచంలో ఏ అన్నదమ్ములు ఇంత ప్రేమగా చూసుకుంటారనుకోలేదు. వీరు నా అన్నదమ్ములు కాదు సార్. నా పంచప్రాణాలు. మీరు చేసిన ఉపకారానికి నేనేమివ్వగలను మాష్టారూ.

ఈశ్వర్ : కన్నీళ్ళు పెట్టుకోకు ఆనంద్! ప్రేమ ఇవ్వగల ఆనందాన్ని నువ్వు చూశావు. నువ్వు చేయగలిగింది ఒక్కటే. నువ్వు అనుభవిస్తున్న ప్రేమ అందరికీ పంచు. అలా పంచాలంటే ప్రేమ గొప్పతనాన్ని నవ్వు తెలుసుకో మన పిల్లలు చిరునవ్వులొలికిస్తూ పాడే పాటలు, వారి ఆనంద తాండవం చూసి తీరాలి.

Contd...9

(ప్రేమయే దైవం అన్న ఖవ్వాలి పాటకి సాయియువత నృత్యం చేస్తూ ఉంటారు.
రాఘవ, గోపాల్, శ్యామ్, ఆనంద్‌కి దువ్వడం, టిఫిన్ తినిపించడం చేస్తారు.)

నిససని సరిరిస నిససని దనిపద నిససని సరిరిప నిసగరిస

సాకీ : ప్రేమయే దైవం జగతికి ప్రేమయే మూలం
ప్రేమయే జీవం ప్రగతికి ప్రేమయే ప్రాణం
ప్రేమలేని జీవితం మరుభూమిలో మల్లెచంగం
ప్రేమలేని జీవితం దివ్వెలేని మందిరం
ప్రేమ పంచే జీవితం సాయిపదములకంకితం
ప్రేమ మయమౌ జీవితం సత్యం శివం సుందరం

పల్లవి : ప్రేమ పెంచుకో ప్రేమ పంచుకో
ప్రేమ పెంచుకో ఆనందమందుకో
ప్రేమ పంచి ప్రేమ పెంచి సాయిదరికి చేరుకో

నిససని సరిరిస నిససని దనిపద నిససని సరిరిప నిసగరిస

సాకీ -1 ప్రేమ పంచిన జీవితం ధరణిలో నవ పారిజాతం
ప్రేమ పెంచిన జీవితం మంద మలయ మారుతం

చరణం-1 ప్రేమతో మకరందమిచ్చి పూలు ధన్యత నొందలేదా
పూలు ధన్యత నొందలేదా
ప్రేమతో తన ఫలముల నిచ్చి తరువు పుణ్యము పొందలేదా
తరువు పుణ్యము పొందలేదా
ప్రేమతో తన స్థన్యమిచ్చి తల్లి దైవము కాలేదా
ప్రేమ పంచిన సత్యసాయి దేవదేవుడు కాలేదా
ప్రేమ పెంచుకో ప్రేమ పంచుకో
ప్రేమ పెంచుకో ఆనందమందుకో

Contd... 10

ప్రేమ పంచి ప్రేమ పెంచి సాయిదరికి చేరుకో

సాకీ - 2 ప్రేమ విరిసిన జీవితం అందమైన కుసుమము
ప్రేమ కురిసిన జీవితం హాయిగొలిపే పరిమళం

చరణం -2 ప్రేమతో శ్రీరామచంద్రుడు శిలను లలనగ చేయలేదా
శిలను లలనగ చేయలేదా
ప్రేమతో గోపాలకృష్ణుడు గోపికల మురిపించలేదా
గోపికల మురిపించలేదా
ప్రేమపంచిన ఈశ్వరమ్మ శివుని సుతునిగ పొందలేదా
ప్రేమ పంచిన సత్యసాయి విశ్వవిభుడు కాలేదా

ప్రేమ పెంచుకో ప్రేమ పంచుకో
ప్రేమ పెంచుకో ఆనందమందుకో
ప్రేమ పంచి ప్రేమ పెంచి సాయిదరికి చేరుకో

సాకీ - 3 ప్రేమ నిండిన జీవితం మధుర మంజుల రాగము
ప్రేమ పండిన జీవితం సుధలు చిలికే గానం

చరణం-3 ప్రేమతో శ్రీ సత్యసాయి ప్రాణదానము చేయలేదా
ప్రాణదానము చేయలేదా
ప్రేమతో మన బాలచంద్రుల సుగుణమణులగ మార్చలేదా
సుగుణమణులగ మార్చలేదా
ప్రేమతో శ్రీసత్యసాయి అమరవైద్యము నొసగలేదా
ప్రేమ మూర్తిగ దీనజనులను అమ్మగా లాలించలేదా

ప్రేమ పెంచుకో ప్రేమ పంచుకో
ప్రేమ పెంచుకో ఆనందమందుకో

Contd...11

ప్రేమ పంచి ప్రేమ పెంచి సాయిదరికి చేరుకో

నిససని సరిరిస నిససని దనిపద నిససని సరిరిప నిసగరిస
ప్రేమ పెంచుకో ప్రేమ పంచుకో
ప్రేమ పెంచుకో ఆనందమందుకో
ప్రేమ పంచి ప్రేమ పెంచి సాయిదరికి చేరుకో

ఈశ్వర్ : ఆనంద్! కంగ్రాచ్యులేషన్స్ డాక్టర్‌గారు వచ్చేశారు. He is doctor Sriram నిన్ను మద్రాసు తీసుకురావద్దని, తానే వస్తానని నీ మీద ఎంతో ప్రేమతో వచ్చారు.

ఆనంద్ : నమస్కారం డాక్టర్‌గారు.

శ్రీరాం : నమస్కారాలు వద్దు. సాయిరాం అను చాలు. అదే మన మంత్రం ఎలా ఉన్నారు? How are you feeling now?

ఆనంద్ : మాష్టారు, సాయి సోదరులందరూ నా బాధని మరచిపోయేట్టు చేశారు. డాక్టర్! నాకు అందరిలా నడవాలని ఉంది. తిరగాలని ఉంది. అన్నిటికీ మించి నాకు డాక్టర్ కావాలని ఉంది డాక్టర్. అది సాధ్యమవుతుందంటారా?

శ్రీరాం : ఆనంద్! Have faith. మనిషిని కాపాడగలిగేవి రెండే. ఆత్మవిశ్వాసం, దైవవిశ్వాసం అవి పెంచుకోండి. మీ నమ్మకాన్ని సడలనీయకండి. మీ ధ్యేయాన్ని మీరే సాధించగలుగుతారు. నా మాట నమ్మండి. Can I examine you.

ఆనంద్ : అలాగే చెయ్యండి డాక్టర్

శ్రీరాం : (పరీక్షించి) ఆనంద్ నువ్వు తప్పకుండా నడగలవు. ఇప్పుడే నీకు సపోర్ట్స్ పెడతాను. విపరీతమైన నొప్పి కలుగుతుంది. భరించు. ప్రసవవేదన తర్వాతే ఏ తల్లికయినా బిడ్డను చూసే ఆనందం కలుగుతుంది. అర్థమయిందా? (కృత్రిమ కాళ్ళు అమరుస్తాడు. రాఘవ, శ్యామ్, ఆనంద్ చేయిపట్టుకుని నడిపిస్తారు.)

Contd... 12

ఆనంద్ : అమ్మో డాక్టర్! ఈ నొప్పి నేను భరించలేను. నేను నడవలేను. నాకీ సపోర్ట్స్ తీసెయ్యండి డాక్టర్ తీసెయ్యండి.

శ్రీరాం : నువ్వు నడవగలవు. You can walk ప్రయత్నించు
Relax ఫర్వాలేదు. ప్రారంభంలో ఇలాగే ఉంటుంది.

ఆనంద్ : నాకు ఆపరేషన్ చేసిన డాక్టర్లు కూడా ఇలాగే అన్నారు. ఆపరేషన్ కాగానే నడవగలవు అని. మీరు కూడా వాళ్ళలా నన్ను మభ్య పెట్టడం లేదు కదా?

శ్రీరాం : No No No! Not at all.

ఆనంద్ : (మళ్ళీ ప్రయత్నిస్తాడు, ఽకూర్చుండి పోతాడు) అమ్మో! ఈ బాధ నేను భరించలేను.

శ్రీరాం : ఫర్వాలేదు, ఫర్వాలేదానంద్, Try once again. Try again.

ఆనంద్ : డాక్టర్‌గారు మీరు Try ,Try అంటారు. భరించలేనంత బాధగా ఉంది. నడువు, నడువు అంటారు. ప్రాణాలు పోతున్నాయి అనుభవిస్తే తప్ప ఈ నరక బాధ మీకెలా తెలుస్తుంది.

శ్రీరాం : నీ బాధ నాకు తెలియదని నీ ఊహ. కానీ నాకు తెలుసు. I Can Understand ఎలా అంటావా. ఇటు చూడు.

ఆనంద్ : డాక్టర్! (ఆశ్చర్యపోతాడు)

శ్రీరాం : ఆనంద్ నీలాగే నాకు రెండు కాళ్ళు యాక్సిడెంట్‌లో దెబ్బతిన్నాయి. జీవితంలో నడవలేనని అనుకున్నాను. నిరాశ, నిస్పృహలు నామనస్సులో కమ్ముకున్నాయి. ఇక నా బ్రతుకు చీకటేననిపించింది. ఆ అంధకారంలో దూరంగా ఒక ఆశాజ్యోతి కనిపించింది. ఆ జ్యోతి పేరే 'భగవాన్ శ్రీ సత్యసాయిబాబా' కొండంత ఆశతో, ప్రశాంతి నిలయం వెళ్ళాను. వారి దివ్య సుందర రూపాన్ని సందర్శించాను. వారి మృదుమధుర భాషణ విన్నాను. ఆత్మవిశ్వాసం, దైవవిశ్వాసం పెంచుకోవాలని వారు చెప్పారు. ఈ రెండూ ఉంటే అసాధ్యంలేదని సెలవిచ్చారు. ఆనాడు "నీవే

Contd... 13

నా దైవం బాబా" అని మొక్కుకున్నాను.

"పరమం పవిత్రం బాబావిభూతం" అని విభూతి మంత్రాన్నే స్మరిస్తూ సాయి విభూతిని సేవించాను. అంతే కొండంత ధైర్యం వచ్చింది. ఏకలవ్యుడిలా స్వామి ఫొటో పెట్టుకొని సాధన చేశాను. బాబా అనుక్షణం నా చేయి పట్టుకొని నడిపిస్తున్నట్లే అనిపించింది. సంవత్సరం సాధనతో నడవగలిగాను. చదవగలిగాను. డాక్టర్‌ని కాగలిగాను.

బాబా ఋణం ఎలా తీర్చుకోగలనని ఆలోచించాను. ఉచితంగా నీలాంటి బాధాతప్తులకు సేవ చేయాలని నిర్ణయించుకున్నాను. సాయి ప్రేమసాగరంలో నేనొకబిందువును మాత్రమే. నాలాంటివారు లక్షలాది మంది సాయిసేవలో తరిస్తున్నవారెందరో

ఆనంద్ : మన్నించండి డాక్టర్. బాధ భరించలేక మిమ్మల్ని నొప్పించాను. మీలానే నేను ప్రయత్నిస్తాను డాక్టర్.

శ్రీరాం : ఆనంద్ నువ్వు నడిచే వరకు వారంరోజులు నేనిక్కడే ఉంటాను.

ఆనంద్ : ( ప్రేమ్ ఈశ్వర్ హై... పాట నేపథ్యంలో వినిపిస్తూ ఉంటుంది. డాక్టర్ అతని సహాయకుడు ఆనంద్‌ని నడిపిస్తారు. ఆనంద్ ప్రయత్నిస్తాడు, చివరకు నడవగలుగుతాడు. అందరూ ఆనందంగా ఉండగా.)

ఆనంద్ : డాక్టర్! నేను నడవగలుగుతున్నాను. మాష్టారూ! నేను నడవగలుగుతున్నాను.

నారాయణ : మాష్టారూ! చూశారా మా వాడు నడుస్తున్నాడు.

ఈశ్వరయ్య : చూశారా నారాయణగారూ! ఆనంద్‌లో మార్పు. ఆనంద్ నీ కలలు తప్పక ఫలిస్తాయి. నువ్వు తప్పకుండా డాక్టర్ అవుతావు.

నారాయణ : మాష్టారూ! ప్రేమ అన్ని బాధల్ని మరపించగలదని అనిర్వచనీయ ఆనందాన్ని పంచగలదని నా కళ్ళు తెరిపించారు. మీ మేలు ఎన్నటికి మరచిపోలేను.

ఆనంద్ : ఈ అనుభవాన్ని ప్రసాదించిన బాబాకు కృతజ్ఞతాంజలి సమర్పించుకుందాం నాన్నా! మాష్టారూ! ఈ సాయిప్రేమరథంలో మాకూ చోటివ్వండి.

Contd... 14

ఈశ్వరయ్య : నారాయణగారూ! సాయిప్రేమసాగరం అనంతం. సాయిరథం పుష్పకవిమానం. విశాల విశ్వంలో ప్రజలంతా ఎక్కినా ఇంకా చోటుంటుంది. దానికి హద్దులు లేవు. హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం...రండి.

(సాయి యువత ఆనందంగా నృత్యం చేస్తారు)

పల్లవి : కదిలిందీ..... కదిలిందీ...
కదిలిందీ సాయిరథం ప్రేమబాటలో
కదిలిందీ సత్యరథం ధర్మనిష్ఠతో
జగతిలోన శాంతి ప్రభలు వెల్లి విరియగ
పరమేశుడే సారధిగా పగ్గాలను పట్టగా
సాయిరాం సాయిరాం సాయి రామరామ రాం

చరణము-1 స్వార్థమన్న మాటెరుగని సాయి పిల్లలం
సాగరాలు దాటి స్వామి సందేశం చాటుతాం
క్రమశిక్షణే మాకభయం
ఏకత్వమే మా లక్ష్యం
స్వామి సాయి పలుకులే మా ఆదర్శం
సత్యసాయి బాటలో సాగుటే మా అదృష్టం ॥ కదిలిందీ ॥
సాయిరాం సాయిరాం సాయి రామరామ రాం
సాయిరామరాం శ్రీ సాయిరామరాం

చరణము-1 కులంలేదు మతంలేదు మానవతే మా ప్రాణం
ప్రభువులకు, పదవులకు తలవంచదు మా హృదయం
సేవలోనే మాకు తృప్తి
సేవచేయుటే స్ఫూర్తి
విశ్వశాంతి ఒక్కటే మా ఆగమ్యం
పర్తిసాయి మాట తలదాల్చుటే మా కర్తవ్యం ॥ కదిలిందీ ॥
సాయిరాం సాయిరాం సాయి రామరామ రాం

జై సాయిరాం